

**జరిగిన కథ :**

కాకతీయ సైన్యం యుద్ధభేరి మోగించింది. చక్రవర్తి గణపతిదేవుని ఆలోచనతో.. నాట్యంతోనే మళ్లీ మామూలు మనిషయ్యాడు జాయపుడు. కొలనిపురం యుద్ధం ప్రారంభమయ్యిందని.. చాలా నిస్పృహగా సాగుతున్నదని తెలుసుకున్నాడు. మళ్లీ మహాయోధుడిలా.. ఉత్సాహంగా యుద్ధక్షేత్రం వైపు దూసుకువెళ్లాడు. తమకు విధేయత చూపకుండా, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఉదయగిరి పాలకుడు పడిరాయడిపై యుద్ధం ప్రకటించాడు జాయపుడు. యుద్ధ షరతులు వినిపించి రమ్మంటూ.. సంధివిగ్రహి ధనభూతిని పంపాడు.

# జాయ సేనాపతి

మత్తి భానుమూర్తి
99893 71284

చారిత్రక కాల్పనిక నవల

"మా సామంతుడిగా ఉండాలి. అంగీకరించిన కప్పాలు చెల్లించాలి. కాకతీయ మహామండలేశ్వరుడు శ్రీశ్రీశ్రీ గణపతిదేవులవారు మీకు పూర్తిరక్షణ కల్పిస్తారు. ఇది గణపతిదేవుల వర్తమానం!''..

ఈ లేఖను అందించిన సంధివిగ్రహి ధనభూతిని పడిరాయడు గౌరవించలేదు. యుద్ధానికి సిద్ధమయ్యాడు.

నిడదప్రోలు, ఉదయగిరి పొలిమేరల్లో స్కంధావారం నెలకొల్పి.. యుద్ధ స్తంభం పాతి తాంబూలమిచ్చి యుద్ధ శంఖారావం చేశాడు జాయప చమూపతి. ఇరువర్గాల మధ్య సంకుల సమరం ప్రారంభమైంది.

''మొదలు మొదలే శత్రుసైన్యంపై దూకుడుగా దాడి చెయ్యండి.. విచక్షణారహితంగా శత్రు సైనికులను నరికివేయండి. మనదే పైచేయిగా ఉండాలి''.. మహాయుద్ధ తంత్రజ్ఞుడు జాయప సేనానులవారి ఆజ్ఞ. దాంతో..

కాకతీయ, సామంత సైన్యం వీరవిహారం చేస్తుండగా ఉదయగిరి సైన్యం బిత్తరపోయి కకావికలమైంది.

''వారానికో శత్రు సైన్యాధికారి తల నా అశ్వం ముందు పడి దొర్లాలి!''..

అప్పుడు మొదలైంది జాయపసేనాని ప్రత్యేకత. కాకతీయ సైనికులకు మొదట లక్ష్యం పరశునాయకుడు.

మంచియోధుడు. మంచి ధనుర్ధారి. వేగంగా బాణం వేయడంలో నిపుణుడు. ఆరోజు పరశు రథంపై వచ్చాడు. కొమ్ముబూర జాయపుని మెడలో ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. దానితో ఓ వింతకూజితం చేశాడు. పరశు, కాకతీయ సేనానులు ఎదురెదురయ్యారు. బాణాలు, బరిసెలు విసురుకుంటున్నారు. అక్కడే పరశు పొరపడ్డాడు. అతను జాయపుణ్ని సమీపించడానికి ప్రయత్నిస్తూ తన మీదికొస్తున్న ముప్పును గ్రహించలేదు. ఎవరో తనపై ఇంతెత్తున దూకడం అతను గుర్తించేసరికి.. బరిసె భుజంలోదిగి గుండెను చీల్చేసింది. రథంలోనే కూలిపోయాడు. ప్రాణాలు పోయేసరికి తన రథం ముందు ఓ ఏనుగుల వరుస నిలబడిందని, అది ముందు చిన్నఏనుగుతో మొదలై తన రథం ముందుకు వచ్చేసరికి మహామత్తగజం ఉండటం గుర్తించేసరికి ఆలస్యమైంది. ఓ ఖడ్గదారి మీదికి దూకి బరిసెను దగ్గరగా గుచ్చడం తెలిసింది. శ్వాస ఆగిపోయింది.

పరశు శిరస్సు వచ్చి విక్రమముందు దొర్లి ఆగింది.

వంగి ముట్టుకున్నాడు. అంతే.. శరీరంలో కంపనలు.. గగుర్పాటు. అచ్చం నాట్య ప్రారంభానికి ముందు కలిగే గగుర్పాటులాంటిది.

తల తిరిగింది. కళ్లముందు కాకతి..

నాట్య ఆహార్యంలో! ఆనంద లాస్యం చేస్తున్నది. జాయపుణ్ని చెయ్యమని రెచ్చగొడుతున్నది. అసంకల్పితంగా జాయప కాలు కదిలింది.

ఆయన కందుక క్రీడ ఆడతాడని సైనికులు భావించారు. కానీ, ఆయన కందుక నాట్యం ఆరంభించాడు. ఉత్సాహంగా సైనికులు కూడా నాట్యం చేశారు. పది ఘడియలు.. వంద ఘడియలు!.

మళ్లీ శత్రు సైనికులు చుట్టుముడుతుంటే కాకతి అదృశ్యం.. చటుక్కున జాయపసేనాని అశ్వం ఆరోహించాడు. యుద్ధం కొనసాగింది. కానీ, యుద్ధరంగంలో అలా కాకతి భావన కలగడం.. దేవాలయంలో కలిగే స్పందనలు యుద్ధభూమిలో కలగడం.. అందులో కాకతి ప్రవేశించడం.. అతనికి దిగ్భ్రమ కలిగించింది. మహోత్సాహం కలిగింది. నాట్యానికి, యుద్ధ విజయానికి సంబంధం ఉందా.. అదే తాండవమా.. అప్పుడే నా నాట్యభాగస్వామి కనిపిస్తుందా.. ఎందుకు.. ఎలా.. ఏమిటిది?

మరునాడు మరో వీరుడు ధర్మవీర నాయకుణ్ని నరికేశారు. గజతంత్రంతో కేవలం వారంరోజులలో మహామహులందర్నీ మట్టుపెట్టాడు గజసాహిణి జాయపసేనాని.

పడిరాయడి శిరస్సును జాయపుడే స్వయంగా నరికేశాడు. శత్రుయోధుడి మరణం జరిగినప్పుడలా నృత్తం.. తాండవం.. కాకతి దర్శనం.. జంట లాస్య తాండవకేళి!

జాయపుడు సింహనాదం చేస్తే కాకతీయ సైన్యం విజయాట్టహాసం చేసింది. తర్వాతి దండయాత్ర కొలనుపురం మీదేనని ఉదయగిరి ఆక్రమించుకున్నాక ప్రకటించాడు. అనుమకొండ మురిసిపోయింది. గణపతిదేవుడు మీసం మెలేశాడు. ఉదయగిరి స్వాధీనంతో బెంబేలెత్తిన